క్లుప్తంగా

ప్రయోగశాల ఆధునికీకరణకు సాయం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ పాఠశాలలోని సైన్స్ ప్రయోగశాల ఆధునికీకరణకు పూర్వ విద్యార్థులు భూముల వెంకటరెడ్డి జ్ఞాపకార్థం మనువడు గోపీకృష్ణ సోమవారం రూ.లక్ష విలువైన చెక్కు, మర్రెడ్డి పద్మావతి రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం వజ్రాల భూపాల రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. విద్యార్థుల అవసరార్థం సైన్స్ ల్యాబ్‌కు విరాళాన్ని అందించినందుకు దాతలను అభినందించారు. పాఠశాల అసిస్టెంట్ రవి ప్రసాద్, నరెడ్ల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



కంకిపాడు: వ్యాయామంతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని కంకిపాడు శాఖ గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పేర్కొన్నారు. వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శిబిరాల్లో భాగంగా కంకిపాడు గ్రంథాలయంలో వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు. రామకృష్ణ మాట్లాడుతూ.. వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాల ప్రయోజనాలపై అమెరికా సంయుక్త రాష్ట్రంలోని కాలిఫోర్నియాలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న పద్మజ వివరించారు. సెలవులకు గ్రామానికి వచ్చిన పద్మజ లైబ్రరీ సేవలను వినియోగించుకోవాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాలను ఎస్.సునీత పర్యవేక్షించారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు



గన్నవరం(హనుమాన్‌జంక్షన్): ఇండో నేపాల్ స్థాయి కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమాన్‌జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు కోచ్ కట్టా సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో తమ స్కూల్ నుంచి 12 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వీరిలో కాటస్ విభాగంలో ఒకరు బంగారు పతకం, నలుగురికి, మరో ఏడుగురు కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు తెలిపారు. కుమిటి విభాగంలో ఇరువురికి బంగారు పతకాలు, ఇరువురు రజిత పతకాలు, మరొకరు కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పతకాలు సాధించే విధంగా ప్రోత్సాహించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి హుండీ బహూకరణ

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠోత్సవం జరిగిన శ్రీఅన్నపూర్ణా దేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి ఇదే గ్రామానికి చెందిన కొప్పుల వెంకటేశ్వర రావు, బేబి సరోజిని దంపతులు సోమవారం కానుకల హుండీ బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీహరి ఆధ్వర్యంలో తొలుత విశ్వేశ్వరునికి అభిషేకాలు, అన్నపూర్ణా దేవికి విశేష పూజలు జరిపారు. అనంతరం రూ.6 వేలు విలువైన స్టీలు హుండీని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులకు దాత అందజేశారు. ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కుటుంబరావు మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ సేవాతత్పరుడు, ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మండవ కుటుంబరావు(67) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం గుండె నొప్పి రావటంతో ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. చుట్టుగుంటకు చెందిన మండవ కుటుంబరావు తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రతి నెలా పది టన్నుల కూరగాయల లారీని పంపించటంతో పాటు నగరంలోని అనేక మంది దాతలను ప్రోత్సహించి కూరగాయలను పంపేవారు. నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. కుటుంబరావు భార్య కాశీ అన్నపూర్ణ గతంలోనే మృతి చెందారు. ఆయన కుమార్తె విదేశాల్లో ఉన్నారు. ఆమె వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

నాలుగేళ్ల సంక్షేమ పాలనపై సర్వత్రా హర్షం

- ఉయ్యూరులో భారీ ర్యాలీ నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పాల్గొన్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉయ్యూరు: మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టో అంతా బూటకమని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉయ్యూరులో సోమవారం రాత్రి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వీరమ్మతల్లి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఎమ్మెల్యే పార్థసారథి, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి జై జగన్ అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండు సెంటరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దారిపొడవునా బాణసంచా కాల్చుతూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రధాన సెంటరులో జరిగిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. చంద్రబాబుకు అబద్ధాలు చెప్పడం వెన్నతోపెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. 2014, 2019లోనూ 600 పేజీల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయని ఘనుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను గతంలో టీడీపీ నాయకులు తప్పుపట్టారని గుర్తుచేశారు. ఇప్పుడు మహానాడులో వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న పథకాలనే పేర్లు మార్చి తమ పథకాలుగా ప్రకటించడం చంద్రబాబు రాజకీయ అనైతికతకు అద్దం పడుతోందన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోయే పరిస్థితుల్లో ఏ ఒక్కరూ లేరని స్పష్టంచేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల సంక్షేమ పాలనలో ప్రజలు అందరూ సంతోషంగా జీవిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలవటానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంపై ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీలి కల్పన, మునిసిపల్ వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు జంపాన కొండలరావు, దాసే రవి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

తీరిన మూడు దశాబ్దాల కల

కంకిపాడు: గొడవర్రు ఎస్సీ కాలనీ వాసుల మూడు దశాబ్దాల కల నెరవేరింది. శ్మశాన వాటికకు వెళ్లే మార్గం వెంబడి విద్యుత్ లైన్ ఏర్పాటు సమస్య ఇన్నాళ్లకు తీరింది. దీంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే మార్గం వెంబడి విద్యుత్ లైన్లు లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మూడు దశాబ్దాల క్రితమే విద్యుత్ లైన్ ఏర్పాటుపై ప్రత్యేక తీర్మానాలు కూడా చేశారు. అయితే సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుత పాలకవర్గం సమస్యపై దృష్టి సారించింది. విద్యుత్ లైన్ ఏర్పాటుకు ప్రత్యేక తీర్మానం చేసింది. రూ.1.91 లక్షలతో విద్యుత్‌శాఖ పర్యవేక్షణలో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ చెన్ను బాబూజీ సోమవారం పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ పాలకవర్గం ముందుండి పనిచేస్తోందని, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా సర్పంచ్ విజయ చంద్రశేఖర్ వివరించారు.



విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ బాబూజీ

వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు

గన్నవరం రూరల్: వలంటీర్‌లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులని ఎంపీపీ అనగాని రవి కొనియాడారు. సోమవారం ముస్తాబాద గ్రామ సచివాలయం వద్ద సేవా మిత్ర అవార్డులు పొందిన 22 మందిని ఆయన సత్కరించారు. సర్పంచ్ వి.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గొప్ప ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌లను, సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఆయన కన్న కలలు నెరవేర్చారని అభినందించారు. రానున్న కాలంలో ప్రభుత్వానికి అండగా నిలిచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని చెప్పారు. జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ గౌసాని మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు కల్లబొల్లి కబుర్లు చెబుతాయని నమ్మొద్దన్నారు. వలంటీర్‌లకు అభినందనలు తెలిపారు. మరింత దీక్షతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జెట్టి నానారావు, హరినాథ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సత్కారం పొందిన వలంటీర్లతో ఎంపీపీ అనగాని రవి

అపార్ట్‌మెంట్ వాసుల నిరసన

దారి ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపణ

రామవరప్పాడు: రహదారిని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ రామవరప్పాడు జెపీ ట్విన్స్ అపార్టుమెంట్ వాసులు, మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. రహదారిని మూసివేసిన ప్రాంతంలో అపార్టుమెంట్ వాసులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అపార్టుమెంట్ అసోసియేషన్ ప్రతినిధి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఇక్కడి జెపీ ట్విన్స్ అపార్టుమెంట్ రెండు బ్లాకుల్లో కలిపి సుమారు 64 ఫ్లాట్లు ఉన్నాయని, వీటిలో సుమారు 250 మంది నివాసం ఉంటున్నారని తెలిపారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇక్కడ 40 అడుగుల రోడ్డు ఉందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రహదారి స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నాడన్నారు. దారిని ఖాళీ చేయాలంటే ప్లాటుకు రూ.20 వేలు ఇవ్వాలని అక్రమదారుడు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై సీఆర్డీఏ ఉన్నతాధికారులు, పంచాయతీ అధికారులకు డాక్యుమెంట్లు, ప్లానుతో సహా ఫిర్యాదు చేశారు. అపార్టుమెంట్ వాసులు అబ్రహం, ఆర్.భానులత, శివకోటి రమా, జయశ్రీ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

గంగూరులో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం

పెనమలూరు: మండలంలోని గంగూరు గ్రామంలో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో ఏఆర్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం చేసి ఎన్నో ఏళ్లు గడవడంతో కుళాయిల నుంచి రంగుమారిన నీరు వస్తోంది. దీంతో స్థానికులు వారం రోజుల క్రితం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి నూతన పైప్‌లైన్ నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.7 లక్షలు మంజూరు చేయించారు. దీంతో దాదాపు 700 మీటర్ల మేర నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అక్బర్‌పాషా మాట్లాడుతూ ఏఆర్‌నగర్ వాసులు కోరిన విధంగా నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామని, స్థానికంగా ఉన్న ఇతర సమస్యలు కూడా వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.



గంగూరులో కొత్తగా పైప్‌లైన్ నిర్మాణం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

రాచూరి కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

కంకిపాడు: జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి సోదరుడు రాచూరి చంద్రబాబు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. చంద్రబాబు భౌతిక కాయానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. చిరంజీవి కుటుంబాన్ని పెనమలూరు, పామర్రు ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. చంద్రబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, కాకర్ల వెంకటరత్నం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్ తదితరులు

ముఖ్యమంత్రి పర్యటనకు పక్కా ఏర్పాట్లు

గుడివాడ టౌన్: పట్టణంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిడ్కో లే-అవుట్ అభివృద్ధి పనులు చివరి దశకు చేరాయని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సోమవారం లే-అవుట్‌లో మౌలిక వసతులు, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పనుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మందపాడు రైల్వే ట్రాక్ కింద నుంచి లే-అవుట్‌కు తాగునీరు పైప్‌లైన్ ఏర్పాటుకు రైల్వే అనుమతి లభించడం, నేడు ఇంటర్ కనెక్షన్‌లు పూర్తవడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. సమీపంలోని కాలువ గట్టుపై రెండు ప్రత్యామ్నాయ వంతెనలు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మోడల్ టౌన్‌షిప్ మాదిరిగా టిడ్కో లే-అవుట్‌ను అభివృద్ధి చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు



పాలక మండలి తీర్మానాలను వివరిస్తున్న చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, సభ్యులు

- గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థాన బస్సు సౌకర్యం
- సేవకులకు లడ్డూ, రెండు పులిహోర ప్యాకెట్లు
- పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం బ్రాహ్మణ వీధికి జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాలక మండలి సభ్యులు, ఈఓ భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వర రావు, ఎల్.రమా, ఏఈవోలు ఎస్.రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎనిమిది అంశాలపై చర్చ సాగింది.

కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు కృషి

దుర్గాఘాట్ వద్ద పవిత్రమైన కృష్ణానదిలోకి భక్తులు దిగి పుణ్యస్నానాలు ఆచరించేలా స్నానఘాట్‌ను అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. ఇప్పటికే ఘాట్‌లో భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మిస్తుండగా, భక్తులు స్నానమాచరించే నది పరివాహక ప్రాంతంలో పేరుకుపోయిన బురద తొలగించేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. అమ్మవారి ప్రసాదాలు, అన్నదానానికి వినియోగించే సరుకులను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తామన్నారు. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థానం బస్సును నడపాలని పాలక మండలి నిర్ణయించింది. దుర్గాఘాట్ నుంచి ప్రారంభమయ్యే బస్సు, కుమ్మరి పాలెం, సితార, పాలప్రాజెక్టు, కొత్తపేట మీదగా మాడపాటి సత్రం, రైల్వే స్టేషన్ 10వ నంబర్ ప్లాట్‌ఫాం, కాళేశ్వరరావు మార్కెట్ మీదుగా కనకదుర్గనగర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ బస్సు ఏర్పాటు చేయడం వల్ల వన్‌టౌన్, గట్టు వెనుక ప్రాంతవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అమ్మవారి సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చే భక్తులకు ఉచితంగా లడ్డూ, రెండు పులిహోర ప్రసాదాలను అందించేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగుల కోసం మహా మండపం దిగువన నాలుగు, కొండపై సమాచారం కేంద్రం వద్ద మరో నాలుగు, మహా మండపం ఏడో అంతస్తులో మరో రెండు వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

మహా మండపంలో ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్

మహా మండపం దిగువన టోల్‌ఫ్రీ నంబర్ కార్యాలయంలో ఆర్జిత సేవా టికెట్ల విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోనే ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్ భక్తులకు అందుబాటులో ఉంది. ముందుగా ఆర్జిత సేవా టికెట్ పొందాలనే వారు ఆలయ ప్రాంగణానికి వచ్చి టికెటు తీసుకోవాల్సి ఉంది. ఇకపై ఆ ఇబ్బంది తొలగిపోయ్యేలా పాలక మండలి మరో కౌంటర్ ఏర్పాటుకు చేయాలని ఆలయ అధికారులను కోరింది. కరోనా సమయంలో తగ్గించిన అన్న ప్రసాద వితరణను ఇకపై రోజూ నాలుగు వేల మందికి, శుక్ర, ఆదివారాలు ఐదు వేల మందికి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సభ్యులు బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీ కృష్ణ, తొట్టడి వేద కుమారి, కొలుకులూరి రామసీత, అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 31న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ సోమవారం చెప్పారు. సాయంత్రం ఐదు గంటలకు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టి, రాత్రికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదం అందించనున్నట్లు ధర్మకర్త చెప్పారు. జూన్ ఒకటో తేదీ ఉదయం హోమాలు, శత కలశ క్షీరాభిషేకం, రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురు కోలోత్సవం, రెండో తేదీ ఉదయం కొతుకోత్సవం, నవకలశ స్నపన, రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడో తేదీన గరుడ, శేషవాహనాలపై స్వామివారి తిరువీధి ఉత్సవం, నాలుగో తేదీన అవభృద స్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణ, ఐదో తేదీన శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆరో తేదీన మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.



ముస్తాబైన కల్యాణ వెంకటేశ్వరుడి ఆలయం

రేపు కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం జీఎస్ రాజు రోడ్డు, వాటర్ ట్యాంక్ పక్కన నూతనంగా నిర్మించిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 31న శ్రీ వాసవి మాత, విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మైలవరపు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. గురువందనం, గోపూజ, గణపతి పూజతో పాటు మహానీరాజనం తదితర పూజాది కార్యక్రమాలు మంగళవారం నిర్వహిస్తామని తెలిపారు. 31వ తేదీ బుధవారం ఉదయం 8.01 గంటలకు యంత్ర ప్రతిష్ఠ స్థాపన, మూల మంత్రహోమాలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, అష్టోత్తర శత కలశ అభిషేకాలు, అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి హాజరవుతారని తెలిపారు. నగరంలోని ఆర్యవైశ్యులు, అమ్మవారి భక్తులు పాల్గొనాలని కోరారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వసుధ భూలక్ష్మీ పూజ



గన్నవరం రూరల్ : మండలంలోని చిక్కవరం శ్రీ క్షేత్ర హనుమత్‌పురంలో సోమవారం శ్రీ వసుధా భూలక్ష్మీ పూజ వేడుకగా నిర్వహించారు. రైతులు పాడి పంటలతో, సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ సూర్య భగవానుడి వృషభ రాశిలో ఉండగా రోహిణి కార్తెలో ఈ పూజా కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు వంశీ తెలిపారు. భూమి తాపం నుంచి రైతులను బయట పడవేసి, దుక్కులకు వాతావరణాన్ని అనుకూలంగా ప్రసాదించమని ఈ పూజ ద్వారా వేడుకున్నట్లు చెప్పారు. దుర్భిక్షాలు, అతివృష్టి, అనావృష్టి బారిన పడకుండా రక్షించాలని కోరారు. పరిసర గ్రామాల రైతాంగం పాల్గొని స్వామివారిని దర్శించారు. చిక్కవరం గ్రామంలో గంగానమ్మను చందనపు అలంకారంతో భక్తులు దర్శించారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై కేసు

పెనమలూరు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. మండలంలోని గోసాల సాయినగర్ కాలువ కట్ట ప్రాంతానికి చెందిన అనూషకు ఎనిమిదేళ్ల క్రితం వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్న షేక్ హుస్సేన్‌తో వివాహమైంది. వారికి కుమారుడు జన్మించాడు. దురలవాట్లకు బానిసగా మారిన హుస్సేన్ అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పెనమలూరు: మండలంలోని పోరంకి - నిడమానూరు రోడ్డులో జరిగిన ప్రమాదంపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలో భార్యాభర్తలైన ఎం.స్వాతి, అశ్వనీకుమార్ నివసిస్తున్నారు. వారికి ఏడాది క్రితం వివాహమైంది. అశ్వనీకుమార్ ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తాడు. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి ఇంటికి వస్తూ పోరంకి నారాయణపురం కాలనీ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో అశ్వనీకుమార్ గాయపడటంతో స్థానికులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మండలానికి రైతు భరోసా రూ.3.61 కోట్లు

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయాల్లో 6567 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.3.61కోట్లు మంజూరయ్యాయని ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 30వ తేదీన రైతు భరోసా పెట్టుబడి సాయం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. ఒక్కో రైతుకి రూ.5500 మొదట విడతగా అందుతుందని పేర్కొన్నారు.

కొత్త వాషింగ్‌మిషన్ ఇవ్వాలని ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలోని ఒక ఎలక్ట్రానిక్స్ షాపులో కొనుగోలు చేసిన వాషింగ్ మిషన్ పనిచేయకపోవటంతో వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడికి కొత్త వాషింగ్ మిషన్ ఇవ్వాలంటూ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల సోమవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం నగరానికి చెందిన ఎండీ జఫ్రుల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా, కమిషన్ సభ్యులు రూ.18,500 కలిగిన కొత్త వాషింగ్ మిషన్‌ను ఇవ్వాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఇవ్వాల్సిందిగా వంశీ ఎలక్ట్రానిక్స్, గోద్రేజ్ కంపెనీని ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు. తీర్పును 30 రోజుల్లోగా అమలు చేయాలని ఆదేశించారు.

4న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, భక్త జన శ్రేయస్సును కాంక్షిస్తూ పౌర్ణమి గిరి ప్రదక్షిణను జూన్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు దుర్గ గుడి ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. 4వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గాఘాట్‌లోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. అలంకరించిన పల్లకిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులు, దేవస్థాన ప్రచార రథంతో పాటు గిరి ప్రదక్షిణ కొనసాగుతుందని చెప్పారు. దేవస్థాన ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదుగా కనకదుర్గనగర్, మహా మండపానికి చేరుకుంటుందన్నారు.